



కొత్తముక్కాం తీరంలో ఇటీవల మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న మెరైన్ పోలీసులు

తీరంపై నిఘా



● మూడేళ్ల కిందట శ్రీలంకలో ఆర్థిక సంక్షోభం ఏర్పడింది. కరోనా వ్యాప్తి తరువాత ఆ దేశ ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారింది. నిత్యావసరాల ధరలు సైతం వందల రెట్లు పెరిగిపోవడంతో ఆ దేశ భవిత ప్రశ్నార్థకంగా మారింది. ఆ సమయంలో శ్రీలంక శరణార్థులు మన దేశంలోకి వచ్చేందుకు ప్రయత్నించారు. ముఖ్యంగా తీరప్రాంతం గుండా ఆంధ్రాలోని 11 జిల్లాలకు చేరినట్టు అప్పట్లో కేంద్ర నిఘా సంస్థలు హెచ్చరించడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది.

● తాజాగా దేశంలో ఉగ్రదాడులు పెరుగుతున్న నేపథ్యంలో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. పాకిస్థాన్‌లో ఉగ్రవాద స్థావరాలపై భారత్ 'ఆపరేషన్ సిందూర' పేరిట క్షిపణి దాడి చేసింది. దీంతో ఉగ్రస్థావరాలు నేలకొరిగాయి. పదుల సంఖ్యలో ఉగ్రవాదులు మృతిచెందారు. ఈ తరుణంలో ప్రతీకార దాడులు ఉంటాయని అనుమానంతో దేశంలో అన్ని తీర ప్రాంతాలకు హెచ్చరికలు వచ్చాయి. దీంతో జిల్లాలోని తీరప్రాంతంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేస్తూ.. ముందస్తుగా భద్రతా చర్యలు చేపడుతున్నారు.

● జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న తనిఖీలు
● మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు
● భారత్-పాక్ మధ్య ఉద్రిక్తత నేపథ్యంలో చర్యలు

రణస్థలం, మే 8(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా తీర ప్రాంతాల్లో అలజడి నెలకొంది. పహల్గాంకు ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్' పేరిట పాకిస్థాన్ ఉగ్రస్థావరాలపై భారత్ క్షిపణి దాడులు చేసింది. ఉగ్రవాదులను మట్టుబెట్టింది. ఈ నేపథ్యంలో మళ్లీ పాక్ ప్రతీకార దాడికి పాల్పడే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. తీరం గుండా మత్స్యకారుల ముసుగులో ఉగ్రవాదులు రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశం ఉందన్న హెచ్చరికలతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. తీర ప్రాంతాలపై నిఘా పెంచి.. సాగర్ కవచ్ నిర్వహిస్తోంది. జిల్లాలో రణస్థలం మండలం దోనిపేట నుంచి ఇచ్ఛాపురం మండలం డొంకూరు వరకూ 193 కిలోమీటర్ల మేర సముద్ర తీరం విస్తరించి ఉంది. రణస్థలం, ఎచ్చెర్ల, శ్రీకాకుళం రూరల్, గార, పోలాకి, సంతబొమ్మాళి, వజ్రపుకొత్తూరు, మందస, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం మొత్తంగా 11 తీరప్రాంత మండలాలు ఉన్నాయి. ఆయా తీరప్రాంతాల్లో పోలీసులు, మెరైన్ పోలీసులు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. మత్స్యకారులను అప్రమత్తం చేస్తున్నారు. కొత్తవారు కనిపిస్తే పోలీస్‌స్టేషన్‌కు సమాచారమందించాలని సూచిస్తున్నారు.

భద్రతకు పెద్దపీట..

జిల్లాలో తీరప్రాంతంపై ప్రత్యేక దృష్టిపెట్టాం. సాధారణ, మెరైన్ పోలీసులతో కలిపి మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్నాం. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారమందించాలని సూచిస్తున్నాం. తీరప్రాంతాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించాం. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉంది.

-కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ, శ్రీకాకుళం

● అరకొర వసతులు.. సిబ్బంది కొరత

తీర ప్రాంత పరిరక్షణ మెరైన్ పోలీసుల బాధ్యత. కానీ జిల్లాలో కేవలం భావనపాడు, కళింగపట్నం, బారువలో మాత్రమే మెరైన్ పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. సిబ్బంది అరకొరగానే ఉన్నారు. తీరంలో గస్తీకి ఆధునిక పరికరాలు లేవు. దీంతో క్రైమ్, ఇతరత్రా పోలీస్ సిబ్బందే అత్యవసర సమయాల్లో విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో మరికొన్ని చోట్ల మెరైన్ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. ప్రతిపాదనలకే పరిమితమవుతున్నాయి. ఒక్కో మెరైన్ పోలీస్‌స్టేషన్‌కు ఒక సీఐ, ఇద్దరు ఎస్ఐలు, ముగ్గురు ఏఎస్ఐలతోపాటు ఇతర సిబ్బంది 40మంది వరకూ ఉండాలి. కానీ ఏ స్టేషన్‌లో కూడా పది మంది సిబ్బంది కూడా లేరు. మరోవైపు తీరంలో గస్తీ కోసం ఎటువంటి పరికరాలు, యంత్రాలు లేవు. ఆధునిక బైనాక్యులర్లు లేవు. తీరంలో వెళ్లేందుకు, పర్యవేక్షించేందుకు బోట్లు సైతం లేవు. సముద్రంలో మత్స్యకారులు చిక్కుకున్నప్పుడు, సముద్ర స్నానాలకు దిగి ప్రజలు గల్లంతైనప్పుడు మెరైన్ పోలీసులు మత్స్యకారులపైనే ఆధారపడుతున్నారు. వారి బోట్లకు ఆయిల్ పోసుకొని ఆచూకీకి వెతుకుతున్నారు. కొన్నేళ్ల కిందట ప్రభుత్వం రూ.5కోట్లతో అత్యాధునిక బోట్లు మంజూరు చేసింది. కానీ నిర్వహణ సరిగ్గా లేక ఆ బోట్లు మూలకు చేరాయి. ఇలా అరకొర వసతులు, సిబ్బంది కొరతతో తీరప్రాంతంలో భద్రతా చర్యలు ఆశించిస్థాయిలో ఉండడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మెరైన్ పోలీస్‌స్టేషన్లను బలోపేతం చేయడంతో పాటు సిబ్బందిని నియమించాలని పలువురు కోరుతున్నారు.



పలాస ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గౌతు శిరీష, జీడి వ్యాపారులు

జయహో భారత్

● 'ఆపరేషన్ సిందూర్'కు మద్దతుగా ర్యాలీ

టెక్కలి/ పలాస, మే 8(ఆంధ్రజ్యోతి): పహల్గామ్ ఉగ్ర దాడికి ప్రతీ కారంగా భారత ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావడంతో టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. భారత సైన్యానికి మద్దతుగా గురువారం టెక్కలిలోని ఇందిరాగాంధీ కూడలిలో 'జయహో భారత్' అంటూ జాతీయ పతాకాలతో సంఘీభావ ర్యాలీ చేపట్టారు. పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై మెరుపుదాడులు చేసి విజయవంతమైన సైనికులకు సెల్యూట్ చేశారు. పలాసలో జీడివ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో ఇందిరా జంక్షన్ నుంచి జీడిపండు జంక్షన్ వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే గౌతు శిరీష మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌కు కేంద్రప్రభుత్వం గట్టిగా బుద్ధి చెప్పింది. దేశాన్ని అస్థిర పరిచే ఏ శక్తులకైనా ఇటువంటి గుణపాఠం తప్పదు. సరిహద్దులో పోరాటం చేస్తున్న సైనికులకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాల'ని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జీడి వ్యాపారులు పాల్గొన్నారు.



టెక్కలిలో జాతీయ జెండాలతో సంఘీభావం తెలుపుతున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు



ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గోవిందరావు

పోర్టు నుంచి పార్క్ వరకు అభివృద్ధి

● కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

మెళియాపుట్టి, మే 8(ఆంధ్రజ్యోతి): మూలపేట పోర్టు నుంచి మెళియాపుట్టి ఇండస్ట్రియల్ పార్క్ వరకు అన్నీ అభివృద్ధి చేస్తామని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. గురువారం మెళియాపుట్టిలో సుమారు 6.28కోట్ల వ్యయంతో 65 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మూలపేట నుంచి మెళియాపుట్టి వరకు రహదారులు విస్తరణ చేస్తే మరిన్ని పెట్టుబడులు వస్తాయి. ఉద్యోగ కల్పన ఉద్యమం కొనసాగుతోంది. దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలి. ప్రతీ నియోజకవర్గంలోనూ ఒక ఇండస్ట్రియల్ పార్క్‌కు భూములు కేటాయిస్తే.. భవిష్యత్‌లో పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. ఇంటికొక పారిశ్రామిక వేత్తను తయారు చేస్తాం. రాష్ట్రంలోనే పాతపట్నం నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడి ఉండడం విచారకరం. పరిశ్రమల ఏర్పాటుతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం. మెళియాపుట్టిలో డోలీమోతలు లేకుండా రహదారుల పనులు చేపడతాం. మెళియాపుట్టిలోనే ఐటీడీఏ ఏర్పాటు చేస్తామ'ని తెలిపారు.

అంతకుముందు సంతలక్ష్మీపురం - గంగన్నపేట, గొడ్డ జంక్షన్ నుంచి అనంతగిరి, రింపి వరకు, కూర్మన్నపేట - కొత్తపేట రహదారుల పనులకు కేంద్రమంత్రి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, తహసీల్దార్ పాపారావు, ఎంపీడీవో ప్రసాద్ పండా, మాజీ ఎంపీపీలు సలాన మోహనరావు, బి.లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు బి.దినకర్‌రావు, భాస్కర్‌గౌడ్, రాజశేఖరెడ్డి, పరమేష్ రెడ్డి, సర్పంచ్‌లు బమ్మిడి భాస్కరరావు, ఆర్.లక్ష్మి పాల్గొన్నారు.

రహదారులకు మహర్దశ

● జిల్లాలో రూ.27కోట్లతో 26 పీఆర్ రోడ్లు



ఎన్‌హెచ్-16 నుంచి కోటబొమ్మాళి-సంతబొమ్మాళి రోడ్డు

టెక్కలి, మే 8 (ఆంధ్రజ్యోతి): అధ్వానంగా ఉన్న రహదారులను బాగుచేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేల చొరవతో రూ.27,25,84,000 నిధులతో 26 పంచాయతీరాజ్ రోడ్లకు మోక్షం లభించనుంది. పంచాయతీరాజ్ పరిధిలో మొత్తంగా 59.69 కిలోమీటర్ల బీటీ రోడ్ల నిర్మాణ ప్రక్రియ జరగనుంది. ఈ నిధుల్లో నాబార్డు వాటా రూ.17.33 కోట్లు కాగా రాష్ట్ర ప్రభుత్వం రూ.9.67 కోట్లు కేటాయించనుంది. టెక్కలి నియోజకవర్గానికి ఆరు రోడ్లు, నరసన్నపేటకు నాలుగు రోడ్లు, ఇచ్ఛాపురం, ఆమదాలవలసకు చెరో మూడు రోడ్లు, శ్రీకాకుళం రెండు, పాతపట్నం, ఎచ్చెర్ల నియోజకవర్గాలకు చెరో రోడ్డు చొప్పున నిర్మాణ పనులు చేపట్టనున్నారు.

● ఆమదాలవలస నియోజకవర్గానికి సంబంధించి ఆమదాలవలస మండలంలో సీఎస్పీ రోడ్డు వయా బొబ్బిలిపేట, వెదుళ్లవలస వరకు రూ.1.80 కోట్లతో 4.30కిలోమీటర్లు, పొందూరు మండలంలో తాడివలస నుంచి గంగ్రేడు వరకు రూ.80లక్షలతో 1.80 కిలోమీటర్లు, సరుబుజ్జిలి మండలంలో మతలబుపేట నుంచి చిన్నమతలబుపేట వరకు రూ.60లక్షలతో 1.20 కిలోమీటర్లు బీటీ రోడ్డు నిర్మించనున్నారు.

● ఎచ్చెర్ల నియోజకవర్గ పరిధిలో ఎచ్చెర్ల మండలంలో తోటపాలెం నుంచి వయా కొత్తపేట, మలముద్ద వరకు రూ.2,99,99,000తో 5.20 కిలోమీటర్లు బీటీ రోడ్డు నిర్మిస్తారు.

● ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిధిలో కంచిలి మండలం ఆర్అండ్‌బీ రోడ్డు 11/6 నుంచి కొండపోలూరు వరకు రూ.86.85లక్షలతో 1.48 కిలోమీటర్లు, బూరగాం నుంచి సోంపేట వరకు 66.84లక్షలతో 1.92 కిలోమీటర్లు, సోంపేట మండలంలో జాతీయరహదారి నుంచి ఎగుపూరు రూ.149.73లక్షలతో 2.96 కిలోమీటర్లు బీటీ రోడ్ల నిర్మాణం చేయనున్నారు.

● నరసన్నపేట నియోజకవర్గ పరిధిలో జలుమూరు, సారవకోట ఎన్‌హెచ్.326 నుంచి వయా లింగటపాడు టు ఎన్‌హెచ్356ఏ వరకు రూ.1.15 కోట్లతో 4.37 కిలోమీటర్లు, నరసన్నపేట మండలం పరిధిలో జాతీయరహదారి పాలసీమ వయా రెడ్డికపేట, బసివలస వరకు రూ.45లక్షలతో 2.83కిలోమీటర్లు రహదారి నిర్మిస్తారు. పోలాకి మండలం పరిధిలో కేసీ రోడ్డు నుంచి వయా చీడివలస, డీఎస్ రోడ్డు వరకు కోటి రూపాయలతో 2.90కిలోమీటర్లు, తలసముద్రం నుంచి డోల రెగ్యులేటర్ వరకు రూ.40లక్షలతో 2.4కిలోమీటర్లు బీటీ రోడ్డు నిర్మించనున్నారు.

● పలాస మండలంలో ఎన్‌హెచ్-5 నుంచి లీలావతి వరకు రూ.39.84లక్షలతో రెండు కిలోమీటర్లు, ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి కొండపల్లి రూ.49.76లక్షలతో మూడు కిలోమీటర్లు, ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి గురుదాసుపురం వరకు రూ.29.90లక్షలతో ఒక కిలోమీటరు, వజ్రపుకొత్తూరు మండలంలో ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి పెద్దబాడాం వరకు రూ.79.70లక్షలతో 3.80 కిలోమీటర్లు, అమలపాడు నుంచి సైనూరు వరకు రూ.84.68లక్షలతో 4.52కిలోమీటర్లు, ఎస్‌పీ రోడ్డు నుంచి చిన్నమురహరిపురం వరకు రూ.29.87లక్షలతో 1.40 కిలోమీటర్లు బీటీ రోడ్డు నిర్మిస్తారు.

● పాతపట్నం నియోజకవర్గంలో సీపీ రోడ్డు నుంచి వయా చంగుడి టు మాకన్నపల్లి వరకు రూ.3 కోట్లతో 6.85 కిలోమీటర్లు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు.

● శ్రీకాకుళం నియోజకవర్గం పరిధిలో గార మండలంలో సీఎస్పీ రోడ్డు (మిగతా 7వ పేజీలో..)

రైల్వేలైన్ భూసేకరణలో ఉద్రిక్తత

6లో



ఆదిత్యుని కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా ఆదిత్యుని కల్యాణం

అరసవల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి కల్యాణం గురువానం వైభవంగా నిర్వహించారు. అనివెట్టి మండపంలో ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యం లో అర్చకులు, వేదపండితులు.. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ ఈ తంతు జరిపిం చారు. ఇప్పిలి సాందీపశర్మ, దర్భముళ్ల శ్రీనివాసశర్మ, ఇప్పిలి షణ్ముఖశర్మ పాల్గొన్నారు.



కమనీయం.. శ్రీకూర్మనాథుని కల్యాణం

7లో

తలసీమియా బాధితుల కోసం రక్తమార్పిడి కేంద్రం

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ● ఆన్‌లైన్‌లో ప్రారంభించిన గవర్నర్ అబ్దుల్ నజీర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 8(ఆంధ్రజ్యోతి): ప్రపంచ రెడ్‌క్రాస్, ప్రపంచ తలసీమియా వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని బాధితుల కోసం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ శ్రీకాకుళంలో ఏర్పాటు చేసిన రక్తమార్పిడి కేంద్రాన్ని రాష్ట్ర గవర్నర్, రెడ్‌క్రాస్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ నజీర్ గురువారం ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ తలసీమియా బాధితుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రక్త మార్పిడి కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాధితులకు మెరుగైన సేవలందించేందుకు ఈ కేంద్రాలు తోడ్పడతాయని తెలిపారు. జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహన్‌రావు మాట్లాడుతూ ప్రతి బుధవారం తలసీమియా బాధితులకు రక్తమార్పిడి చేయనున్నట్లు తెలిపారు. బాధితులకు రాను పోను ఖర్చులు, పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆరుగురికి రక్తమార్పిడి చేయగా, శివానీ గ్రూప్ ఆఫ్ కాలేజెస్‌కు చెందిన 30 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్‌కుమార్, ఆర్డీవో సాయి ప్రత్యూష, జిల్లా అగ్నిమాపక అధికారి జె.మోహనరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ అనిత, ఏడీసీ చంద్రరావు, రెడ్‌క్రాస్ కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, వైస్ చైర్మన్ డాక్టర్ కె.సుధీర్ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

విద్యార్థుల రక్తదానం..

ఎచ్చెర్ల, మే 8(ఆంధ్రజ్యోతి): తలసీమియా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు రక్తదానం చేశారు. శ్రీ శివానీ ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలు (చిలకపాలెం), ప్రై. వ్యవసాయ కళాశాల (ఎస్ఎస్ఆర్ పురం)కు చెందిన విద్యార్థులు శ్రీకాకుళం అనురాగ నిలయంలో గురువారం రక్తదానం చేశారు.

రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా?

● గోతులతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

కొత్తూరు, మే 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి ఇతర ప్రధాన పట్టణాలు, గ్రామాలకు ఉన్న మార్గాలు గోతులమయంగా తయారై వాహనదారులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. కొత్తూరు నుంచి శ్రీకాకుళం, పాలకొండ-నివగాం వెళ్లే మార్గాల్లోని పలు చోట్ల రోడ్లపై గోతులు ఏర్పడి నీరు నిలిచిపోతోంది. దీంతో రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. గోతులను తప్పించే క్రమంలో ఎదురుగా వచ్చే వాహనాలు ఢీకొని గాయాల బారిన పడాల్సి వస్తోందని పలు వురు వాహనచోదకులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. ఏ మాత్రం వర్షం పడినా గోతుల్లో రోజుల తర బడి నీరు నిలిచిపోతోంది. గోతుల్లో వాహనాలు దిగి పాడవుతున్నాయి. ప్రధానంగా గ్రామీణ వికాస్ బ్యాం కు వద్ద, నివగాం గౌడివీధి సమీపం లో పరిస్థితి దారుణంగా ఉంది. నిత్యం వందలాది వాహనాలు రాక పోకలు సాగించే ఈ మార్గాల్లో కనీసం గోతులను కప్పే ప్రయత్నం కూడా ఆర్‌అండ్ బీ అధికారులు చేపట్టక పోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. నివగాం వద్ద సీసీ రోడ్, కాలువ నిర్మాణానికి సుమారు రూ.39 లక్షలు, కొత్తూరు రహదారిలో బ్యాంకు వద్ద సీసీ రోడ్, డ్రైన్ నిర్మాణానికి రూ.26 లక్షలు మంజూరయ్యాయని గతంలో అధికా రులు తెలిపినప్పటికీ నేటికీ పనులు ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకో వాలని వాహనదారులు కోరుతున్నారు.


నివగాం వద్ద దారుణంగా ఉన్న రోడ్డు


కొత్తూరు గ్రామీణ బ్యాంకు వద్ద ఇలా..

తలతరియా మార్గం..

జలుమూరు, మే 8(ఆంధ్రజ్యోతి): తలతరియా రహదారి గోతులమయంగా తయారై వాహనాలు రాకపోకలు సా గించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాతపట్నం హైవే నుంచి తలతరియా గ్రామం వరకు సుమారు 5 కిలో మీటర్ల రోడ్డు పదేళ్ల కిందట నిర్మించారు. ఆ తరువాత ఎటు వంటి నిర్వహణ లేకపోవడంతో గోతులతో నిండింది. దీంతో పలు గ్రామాల ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని అయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


అబ్బాయిపేట వద్ద రోడ్డు పరిస్థితి..

12 ఒడిశా సారా ప్యాకెట్లు స్వాధీనం

ఇచ్ఛాపురం, మే 8(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి అక్రమంగా సారా ప్యాకె ట్లు తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ పి.దుర్గా ప్రసాద్ గురు వారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం రాత్రి ఆంధ్రా-ఒడిశా సరిహ ద్దులో దాడులు చేపట్టగా ఒడిస్సాకు చెందిన జనక దాసు 12 సారా ప్యాకెట్ల తో ఆంధ్రాలోకి వస్తుండగా పట్టుకున్నామన్నారు. అలాగే పాత కేసుల్లో పట్టుబడిన ఐదుగురిని కవిటి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కొత్తూరు, మే 8(ఆంధ్రజ్యోతి): కర్లెమ్మ గ్రామం వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బొడ్డ నానాజీకి తీవ్ర గాయాల య్యాయి. బత్తిలి సంత నుంచి కొత్తూరు వైపు ద్విచక్ర వాహనంపై భార్యతో కలిసి వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీ కొనడంతో నానాజీకి తలకు తీవ్ర గాయమై రక్త స్రావం జరిగింది. వెంటనే స్థానికులు కొత్తూరు సామాజిక ఆసుపత్రికి తరలించారు. నానాజీ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ గోవిందరావు తెలిపారు.

కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలు

నరసన్నపేట, మే 8(ఆంధ్రజ్యోతి): నరసన్న పేట పట్టణంలో అక్రమ నిర్మాణాలు జోరుగా సా గుతున్నాయి. చెరువులు, కాలువలను కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతు న్నారు. శివనగర్ కాలనీలో చెరువును కొందరు ఆక్రమించి వారం రోజులుగా నిర్మాణాలు చేపడుతున్నారు. గురువారం పురుషోత్తనగర్ కాల నీలో 11 ఆర్ కిల్లాం గట్టును, మారుతీనగర్‌లో కాలువను ఆక్రమించి నిర్మా ణాలు చేపట్టినా అధికారులు పట్టించుకోలేదు. కోర్ టెక్నాలజీ పక్కనే కాలువ స్థలంలో పక్కా భవనాలు నిర్మిస్తున్నా రెవెన్యూ, పంచాయతీ అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.


గట్టు ఆక్రమించి నిర్మిస్తున్న దృశ్యం

16 నుంచి సమ్మెకు సిద్ధం

పలాస, మే 8(ఆంధ్రజ్యోతి): జీడి కార్మికులతో వ్యాపారుల ఒప్పంద వ్యవహారం కొలిక్కి రాకుంటే ఈనెల 16వ తేదీ అర్ధరాత్రి నుంచి జీడి కార్మికులు సమ్మెలో పాల్గొంటారని కార్మిక సంఘ అధ్యక్షుడు అంబటి కృష్ణ మూర్తి ప్రకటించారు. ఈ మేరకు సమ్మెకు మద్దతు తెలపాలని కోరుతూ ఎమ్మెల్యే గౌతు శిరీష, జిల్లా కార్మికశాఖ అధికారి, కాశీబుగ్గ సీఐలకు లేఖలు అందించారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి వేతన ఒప్పందాల గడువు పూర్త యిందన్నారు. ప్రస్తుతం ఇస్తున్న వేతనాలు మరో రెండేళ్ల పెంచాలని వ్యాపారులు కోరారని, దీనిని అంగీకరించలేదన్నారు. ఈనెల 16న తుది సమావేశం నిర్వహించేందుకు నిర్ణయించామని, వేతన ఒప్పందం కుదర కుంటే సమ్మెకు వెళతామన్నారు.

రైల్వేలైన్ భూసేకరణలో ఉద్రిక్తత

సంతబొమ్మాళి, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నౌపడ పంచాయతీ కూర్మనాథపురంలో పోర్టు రైల్వే లైన్ కోసం భూ సేకరణలో గురువారం ఉద్రికత్త నెలకొంది. గ్రామానికి చెందిన రైతు కోట రామ్మూర్తి తనకు ఉన్న 58 సెంట్ల భూమి పోర్టు రైల్వే లైన్ ఏర్పాటుకు ఇవ్వలేదు. గురువారం రెవె న్యూ అధికారులు ఆ భూమిని స్వాధీనం చేసుకోవడంతో ఉద్రిక్త వాతావర ణం నెలకొంది. ఈ ప్రాంతంలో మెట్టు భూమి సెంటు రూ.1.50 లక్షలు ఉందని, రూ.25 వేలు పరిహారం ఇవ్వడం ఏమిటని రామ్మూర్తి ప్రశ్నిం చాడు. నష్ట పరిహారం చాలదని తాను హైకోర్టును ఆశ్రయించానన్నారు. ఇంతలో రెవెన్యూ పోలీసు, పోర్టు అధికారులు యంత్రాలతో తన భూమిని చదును చేసేశారని వాపోయాడు. తనకు న్యాయం చేయాలని కోరారు.

మానసిక వేధింపులతో వివాహిత ఆత్మహత్య

సీతంపేట (విశాఖపట్నం), మే 8 (ఆంధ్రజ్యోతి): భర్తను కాదని మరో యువకుడిని ప్రేమించి వివాహం చేసుకున్న ఓ మహిళ చివరకు వేధింపు లకు గురై మానసిక వేదనతో ఆత్మహత్యకు పాల్పడింది. విశాఖపట్నంలోని ద్వారకా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...శ్రీకాకుళం జిల్లా టెక్కలి రంగాపురానికి చెందిన ఎల్.శ్రావణికి 2022లో బి.మాధవరావుతో పెద్దలు కుదిర్చిన వివాహం జరిగింది. అయితే శ్రావణి చదువుతానని చెప్పడంతో నగరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాల్లో భర్త చేర్పించాడు. కళాశాల్లో చదువుతు న్న సమయంలో కొమర రోహిత్‌కుమార్ ఆమెకు పరిచయమై వారి మధ్య ప్రేమకు దారితీసింది. దీంతో శ్రావణి తన కుటుంబ సభ్యులతో మాట్లాడి మాధవరావుతో ఇకపై ఉండనని, రోహిత్‌కుమార్‌ని వివాహం చేసుకుంటా నని తెలిపింది. ఈ క్రమంలో మాధవరావుకు విడాకులిచ్చింది. అనంతరం రోహిత్‌కుమార్, శ్రావణి కుటుంబాల అంగీకారంతో వీరికి రిజిస్టర్ వివా హం జరిగింది. ఇద్దరూ కొద్ది రోజులు హైదరాబాద్‌లో ఉండి అనంతరం విశాఖపట్నం వచ్చి కాపురం పెట్టారు. శ్రావణిని ద్వారకా పోలీసుస్టేషన్ ప రిధిలో ఉన్న ఒక హాస్టల్‌లో రోహిత్‌కుమార్ ఉంచాడు. వారి మధ్య గొడవ లు ప్రారంభమయ్యాయి. శ్రావణి తనతో కలిసి ఉండమని కోరినప్పుడు రో హిత్ దురుసుగా వ్యవహరించేవాడు. అద్దె చెల్లించే ఆర్థిక స్థోమత తనకు లేదని, కలిసి జీవించాలంటే తన ఖర్చులు తానే భరించాలని శ్రావణిని వేధించేవాడు. అంతేకాకుండా ఆమెను వివాహం చేసుకున్నందుకు చింతి స్తున్నానని, నువ్వు చనిపోతే సంతోషంగా ఉంటానని రోహిత్‌కుమార్ మాటలతో వేధించాడు. దీంతో విరక్తి చెందిన శ్రావణి బుధవారం క్రిమిసం హారక మందు తాగింది. హాస్టల్‌లో ఉన్నవారు చికిత్స నిమిత్తం ఆమెను ఆ సుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి తండ్రి తిరుపతిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్వారకా పోలీసు స్టేషన్ సీఐ రమణ ఆధ్వర్యంలో ఎస్ఐ ధర్మేందర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

సమస్యల పరిష్కారానికి 'ప్రజాదర్బార్'

● కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

పాతపట్నం, మే 8(ఆంధ్ర జ్యోతి): ప్రజా సమస్యల పరిష్కా రానికి 'ప్రజాదర్బార్' నిర్వహిస్తు న్నామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. పాతపట్నంలో గురువారం ఎమ్మె ల్యే మామిడి గోవింద రావు ఆధ్వ ర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించి వినతులు స్వీకరించారు. ఈ సంద ర్భంగా మంత్రి మాట్లాడు తూ.. ప్రజలతో నేరుగా మాట్లాడి ప్రతి సమస్య సత్వర పరిష్కరించ నున్నామన్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాలనుంచి ప్రజలు తరలివచ్చి పించ న్లు మంజూరు చేయాలని, ఇళ్ల స్థలాలు కేటాయిం చాలని కోరారు. దీంతో ఆయన వెంటనే సంబంధిత ఎంపీడీవోలతో మాట్లాడి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే గిరిజన గూడ ల్లో తాగునీటి ఇబ్బం దులున్నాయని పలు గ్రామాల ప్రజలు ఆయన దృష్టికి తీసుకు వెళ్లగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాటా్లడి నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనం తరం నీలమణిదుర్గ అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు కేంద్ర మంత్రి, ఎమ్మెల్యేలను సత్కరించి అమ్మవారి చిత్రపటాలను అందించారు. ఈ సందర్భంగా బైక్‌ర్యాలీ చేపట్టారు. గజమాలతో వారిని అభిమానులు సత్కరించారు. అనంతరం పీఎల్‌పురం పంచాయతీ పీటీ రోడ్డు నుంచి ద్వారకాపురం రోడ్ వరకు ప్రధానమంత్రి జన్‌మన్ నిధులు రూ.63 లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు కేంద్రమంత్రి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, డ్వామా పీడీ బి.సుధాకర్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, కూటమి నేతలు పాల్గొన్నారు.


ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గోవిందరావు

నిరుపేదలందరికీ కాలనీ ఇళ్లు

● ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి, మే 8(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరి ధిలోని నిరుపేదలందరికీ ఇళ్లు మంజూరుకు చర్య లు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి అన్నారు. గురువారం కత్తిరవానిపేటలోని క్యాంపు కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, ఇంజనీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు కాలనీ ఇళ్లు మంజూరయ్యేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.


సూచనలిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

న్యూస్ బాక్స్

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

నరసన్నపేట, మే 8(ఆంధ్రజ్యోతి): వివి ధ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 20న దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నామని, ఇందులో ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయా లని సంఘం స్థానిక బ్రాంచ్ కమిటీ అధ్య క్షుడు ఆర్.సురేష్‌బాబు కోరారు. గురువా రం ఎస్‌బీసీ కార్యాలయం వద్ద భోజన విరామం సమయంలో సమ్మె పోస్టర్‌ను ఆ విష్కరించారు కార్యక్రమంలో సంఘ నా యకులు ఎం.మాధవరావు, డీబీ శ్రీనివాస రావు, ఎల్.శ్రీనిధి, బి.ఉమామహేశ్వరి తది తరులు పాల్గొన్నారు.

లక్ష్యాలు సాధించాలి

టెక్కలి, మే 8(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో లక్ష్యాలు సాధించాలని ఎంపీడీవో చింతాడ లక్ష్మీబాయి అన్నారు. స్థానిక మం డల పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ శాఖల అధికారు లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం పనులు, గోశాలలు, నీటి తొట్టిలు, ఇంకుడు గుంతల నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. పశుదాణా సరఫరాపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమం లో పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బకు ఉపాధి కూలీ మృతి

టెక్కలి, మే 8 (ఆంధ్రజ్యోతి): రావి వలసలో ఉపాధి పనికి వెళ్లిన అన పాన పార్వతి (55) గురువారం వడ దెబ్బ తగిలి అస్వ స్థతకు గురైంది. వెంటనే ఆమెను తోటి కూలీలు చికిత్స నిమిత్తం స్థానిక జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా మృతిచెందింది. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.


పార్వతి (ఫైల్)

నవ ధాన్యాల సాగుతో అధిక ఆదాయం

కొత్తూరు, మే 8(ఆంధ్రజ్యోతి): వరి పంటలో నవధాన్యాల సాగుతో అధిక ఆదా యం పొంద వచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా పర్యవేక్షకుడు ఎంటీ సూర్యనారా యణ అన్నారు. గురువారం సోమరాజ పురంలో నవధాన్యాల పంట సాగుపై అవగాహన కలిగించారు. నవ ధాన్యాలు సాగువలన భూసారం పెరిగి కలుపు నివారణ సాధ్యమవుతుందన్నారు. భూమి లో నిద్రావస్థలో ఉన్న సూక్ష్మజీవుల వృద్ధి పెరుగుతుందన్నారు. 12 రకాల పంటలతో రెండు కేజీల పరిమాణం కలిగిన కిట్స్ తయారీపై రైతులకు అవగాహన కలిగిం చారు. కార్యక్రమంలో సర్పంచ్ వాన మల్లే శ్వరి, రాజు, గోవిందరావు, పాల్గొన్నారు.

ముగిసిన ఆధ్యాత్మిక శిక్షణ

నరసన్నపేట, మే 8(ఆంధ్రజ్యోతి): బొ డ్డవలసలో ఉన్న చిన్మయ మిషన్‌లో గత వారం రోజులుగా నిర్వహించిన ఆధ్యాత్మిక, ఆరోగ్య ప్రత్యేక శిబిరం గురువారంతో ము గిసింది. పిల్లల్లో ఆధ్యాత్మిక భావాలను పెంపొందించడం ద్వారా పెద్దల పట్ల గౌర వం పెరుగుతుందని అన్నారు. కార్యక్రమం లో పలువురు చిన్మయ మిషన్ సభ్యులు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించాలి

పలాస, మే 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తు న్న వాట్సాప్ గవర్నె న్స్‌పై ప్రజలకు అవగా హన కల్పించాలని మునిసి పల్ కమిషనర్ ఎస్.రామా రావు కోరారు. ఈ మేర కు గురువారం మనమిత్ర యాప్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేవలం ఫోన్ ద్వారా ప్రభుత్వ సమాచారంతో పాటు అన్ని పౌర సేవలు పొందవచ్చన్నారు. ఇంటింటికీ వెళ్లి దీనిపై అవగాహన కలిగించాలని సూచిం చారు. సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి చెరువుల అభివృద్ధికి చర్యలు: శిరీష

వజ్రపుకొత్తూరు, మే 8(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుం టోందని, సాగు నీటి చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. గురువారం ఉపాధి హామీ నిధులు రూ.1.65 కోట్లతో 25 సాగునీటి పనులకు భూమిపూజ చేశారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతు సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే వంశధార నీరు శివారు భూములకు అందిం చామన్నారు. కార్యక్రమంలో వంశధార ఈఈ శేఖర్, ఎంపీడీవో ఎన్.రమేష్ నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, నీటి సంఘం అధ్యక్షుడు గౌనప నిరంజన్, దువ్వాడ అప్పారావు, దుంపల వల్లభరావు, శిష్టు పాపారావు పాల్గొన్నారు.


వజ్రపుకొత్తూరు: నగరంపల్లిలో సాగునీటి చెరువుల పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలి

పలాస, మే 8(ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు స్థాపించడం ద్వారా కనీసం 500 మందికి ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి చేయాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. గురువారం రామకృష్ణాపుర వద్ద రూ.7 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఈ పార్కుకు శంకు స్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రామకృష్ణాపురం వద్ద 60.84 ఎకరాల విస్తీర్ణంలో పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 76 యూనిట్లను ఏర్పాటు చేసేందుకు గాను 1000 చదరపు మీటర్ల చొప్పున స్థలాలను కేటాయించారన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డిప్యూటీ జనరల్ మేనేజర్ జయబాబు, వ్యాపారుల సంఘం అధ్యక్షుడు మల్లా శ్రీనివాస రావు, మల్లా రామేశ్వరరావు, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శాసనపురి మురళీ కృష్ణ, ఆర్డీవో జి.వెంకటేష్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణయాదవ్, టీడీపీ నేతలు బడ్డ నాగరాజు, సప్ప నవీన్, దడియాల నర్సింహులు, పోలాకి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలపై దమనకాండ నిలుపుదల చేయాలి

పలాసరూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): ఆది వాసీలపై దమనకాండను నిలుపుదల చేయా లని, వారి బతుకు లను విధ్వంసం చేస్తే పోరాటాలు తప్పవని ప్రజా సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక ప్రతినిధులు స్పష్టం చేశారు. బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో గురువారం కగార్ ఆపరేషన్‌ను నిలుపుదల చేయాలన్న డిమాండ్‌పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రజా సంఘాల నాయకులు పత్రి దానేసు, తాండ్ర ప్రకాశ్, వంకల మాధవరావు, కుత్తుమ దుష్యం త్, ఎం.రామారావు మాట్లాడుతూ.. మధ్య భారతంలో స్వాతంత్ర్యానికి ముందు బ్రిటీష్ వారితో పోరాటం చేసి న ఆదివాసీలపై ప్రస్తుత ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట దాడులు చేయడం దారుణ మన్నారు. ఇటువంటి బూటకపు దాడులను నిలుపుదల చేసి శాంతియుత వాతావరణం నెలకొల్పాలన్నారు. కార్య క్రమంలో ఆయా సంఘాల నేతలు కోదండరావు, వాసుదేవరావు, వీరా స్వామి, డి.గోవిందరావు, కె.రమేష్, ప్రభాకర్ తదిత రులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వివిధ ప్రజాసంఘాల నాయకులు

కాలిన నీటి పథకం మోటార్లు

నరసన్నపేట, మే 8(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట మే జర్ పంచాయతీకి తాగునీరందించేందుకు దేవాది గ్రామం వద్ద ఏర్పాటు చేసిన నీటి పథకం మోటార్లు కాలిపోవడంతో నీటి సరఫరా నిలిచి పోయింది. రెండు రోజుల కిందట విద్యుత్ హెచ్చు, తగ్గులతో మోటార్లు కాలిపోవడంతో బజారువీధి, మఠంవీధి, జోగిపేట, బొ డ్డవలస, స్టేట్‌బ్యాంకు వీధి, భవానీపురం, కొత్తవీధి తది తర వీధుల్లోని కుళాయిల నుంచి నీరు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మోటా ర్ల మరమ్మత్తులు చేపట్టి మరో మూడు రోజుల్లో తాగు నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని ఈవో ద్రాక్షాయిణి తెలిపారు. ఇటీవల కొత్త మోటార్లు కొనుగోలు చేసి ఏ ర్పాటు చేసినా విద్యుత్ హెచ్చుతగ్గులతో కాలిపోవడం తో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో టాంకర్లతో నీటిని సరఫరా చేయడం జరు గుతుందని ఆమె పేర్కొన్నారు.

కల్యాణ వైభోగమే..

టెక్కలి, మే 8(ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టుమహాదేవి కోనేరు గట్టుపై ఉన్న శ్రీదేవి, భూదేవి సహిత వైభవ వేంక టేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామి కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైశాఖ శుద్ధ ఏకాదశి పర్వ దినం సందర్భంగా వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణం కనులపండువగా చేపట్టారు. భక్తులు కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్య క్రమంలో అర్చకుడు నానీబాబు, నేతలు లమ్మత మధు, రాంప్రసాద్, బాలకృష్ణ, నారాయణ, ప్రసాద్‌రెడ్డి, జగ న్నాథం, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

గొటివాడలో..

జలుమూరు, మే 8(ఆంధ్రజ్యోతి): గొటివాడ గ్రామంలో కొలువు తీరిన వీర వెంకట సత్యనారాయణ స్వామి కల్యా ణం గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ద్వితీ య వార్షికోత్సవం సందర్భంగా ఉదయం అర్చకులు మా గంటి ప్రసాద్ నేతృత్వంలో స్వామికి ప్రత్యేక పూజలు, అ భిషేకాలు చేశారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవ చనం, కంకణధారణతో పాటు స్వామివారి కల్యాణం చేపట్టారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ చేశారు. ఈ కార్య క్రమంలో గొటివాడతో పాటు సైరిగాం, మూర్తిపేట, పాగో డు, రామయ్యవలసలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

నందిగాం, పెంటూరుల్లో..

నందిగాం, మే 8(ఆంధ్రజ్యోతి): నందిగాం, పెంటూరు గ్రామాల్లో వేంకటేశ్వరస్వామి కల్యాణం గురువారం కనుల పండువగా జరిగింది. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకులు కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిం చారు. ధర్మకర్తలు బొడ్డ జనార్ధనరావు, కృష్ణారావు, నారా యణరావు, సనపల సీతారాం ఆధ్వర్యంలో వేదపండితు లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వంశ ధార ఎస్ఈ పీవీ తిరుపతిరావు, యూటీఎఫ్ జిల్లా కార్య దర్శి బి.శంకరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


సత్యనారాయణస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు


టెక్కలి: వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


నందిగాం: పెంటూరులో స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

హంస వాహనంపై శ్రీనివాసుడు

నరసన్నపేట, మే 8(ఆంధ్రజ్యోతి): స్థానిక వేంక టేశ్వర స్వామి ఆలయంలో ప్రారంభ మైన శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామిహంస వాహనంపై భక్తులకు దర్శన మిచ్చాడు. వేదమం త్రాల మధ్య శ్రీదేవి, భూ దేవి సహిత శ్రీనివాసునికి ఉదయం సుప్రభాత సేవతో పూజలు ప్రారంభం కాగా ఆలయం లో మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. పెద్దపేట, తిరుమల వీధి తదితర ప్రాంతాల్లో తిరువీధి నిర్వహించారు. ఈ సందర్భంగా కూచి పూడి, కోలాట నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో మ వుడూరి జగదీష్‌బాబు, చామర్తి కృష్ణమాచార్యులు, జోస్యుల జగ న్నాథశర్మ పాల్గొన్నారు.


హంసవాహనంపై శ్రీనివాసుని తిరువీధి

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని గ్రామోత్సవం

జలుమూరు, మే 8(ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీ శ్రీముఖలింగం లోని శ్రీముఖలింగేశ్వరస్వామి గ్రామోత్సవం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. వైశాఖ శుద్ధ ఏకాదశిని పురస్కరించు కుని ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిం చారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను ప్రత్యేక పల్లకిలో వేం చేపు చేసి వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ తిరువీధి చేపట్టారు. పలువురు మహిళలు స్వామికి హారతులిచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.ప్రభాకరరావు, అర్చకులు నారాయణమూర్తి, వెంకటాచలం, సింహాచలం, అచ్యు త, శివ, శ్రీకృష్ణ, అప్పారావు, యోగి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎచ్చెర్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ పనుల కారణంగా 11 కేవీ ఎచ్చెర్ల, 11 కేవీ ఎస్ఎస్ఆర్‌పురం, 33/11కేవీ ఎచ్చెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పైడి యోగేశ్వరరావు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాలో అంతరాయం కలగనుందని ఈఈ పైడి యోగేశ్వరరావు తెలిపారు. ఎచ్చెర్ల, ఎస్ఎస్ఆర్‌పురం, చినరావుపల్లి, జరజాం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పొందూరులో..

పొందూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): పొందూరు సబ్‌స్టేషన్ పరిధిలోని టౌన్‌ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ పైడి యోగేశ్వరరావు తెలిపారు. విద్యుత్ లైనులకు అడ్డుగా ఉన్న చెట్టుకొమ్మల తొలగింపు, ఇతర నిర్వహణ పనులు చేపడుతున్నట్టు తెలిపారు. టౌన్‌ఫీడర్ పరిధిలో పొందూరు, జోగన్నపేటతండ్యాం, మల్లేశుపేట, మీసాలపేట, గూణానపేట, బొట్లపేట, కిలారిపేట తదితర గ్రామాలలో ఉదయం 8.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేయనున్నట్టు ఈఈ తెలిపారు.

శ్రీకాకుళంలో..

శ్రీకాకుళం, మే 8 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరానికి ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ యోగశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పీఎన్ కాలనీ సెక్షన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించే కార్యక్రమం చేపడుతున్నట్లు ఏఈ వెల్లడించారు. ఈ కారణంగా తోటపాలెం, దుప్పలవలస, సాత్‌నగర్, ఉడా లే అవుట్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

సంజీవయ్య సేవలు స్ఫూర్తిదాయకం



సంజీవయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అరసవల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): అతిచిన్న వయసులోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఘనత దామోదరం సంజీవయ్యకు సొంతమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు పేర్కొన్నారు. ఆయన సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. గురువారం దామోదరం సంజీవయ్య వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సాయిదుల్లాఖాన్, బి.సంజీవరావు, పి.రమేష్‌కుమార్, అనుపోజు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. సంజీవయ్య మెమోరియల్ ట్రస్టు నాయకులు కంత వేణు, తైక్వాండో శ్రీనులు నగరంలోని సంజీవయ్య పార్కులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆధ్యాత్మిక భావనతో మేలు



విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాసానంద స్వామి

రణస్థలం, మే 8 (ఆంధ్రజ్యోతి): యువత గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టి... ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పాలని శ్రీనివాసనంద స్వామీజీ అన్నారు. గోసాం గ్రామంలో గురువారం కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్వామి దర్శనం అనంతరం భక్తులకు ఆధ్యాత్మిక సందేశం ఇచ్చారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టడం మంచిదన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

బూర్జ, మే 8 (ఆంధ్రజ్యోతి): కొల్లివలస గ్రామానికి తాగునీటి సమస్య వెంటాడుతోందని మండల ఉపాధ్యక్షుడు బుడుమూరు సూర్యారావు పేర్కొన్నారు. దీనిని పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు ఎంపీడీవోకు గురువారం వినతిప త్రం అందించారు. కొన్నేళ్లుగా తాగునీటి కోసం గ్రామస్థులు అల్లాడుతున్నారన్నారు. వాటర్ ట్యాంకర్‌ను ఇప్పించి దాహార్తి తీర్చాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో కొల్లివలస ఎంపీటీసీ సభ్యుడు విక్రమ్ తదితరులు ఉన్నారు.

వైద్యురాలికి అన్యాయం చేయొద్దు

అరసవల్లి, మే 8(ఆంధ్రజ్యోతి): పాతపట్నం మండలం బైదలాపురం పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ సత్యవాణి పట్ల డీఎంహెచ్ఓ వ్యవహరించిన తీరు సరిగా లేదని... ఆ వైద్యురాలికి అన్యాయం చేయొద్దని ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్, దళిత సంఘాల జేఏసీ నాయకులు కోరారు. గురువారం వారు డీఎంహెచ్ఓ కార్యాలయంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ మేరీ క్యాథరిన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతమైతే దళిత సంఘాలు చూస్తూ ఊరుకోవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బడే కామరాజు, బి.రమేష్, మిస్కా నవీన్, పడాల ప్రతాప్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణతో ఒడియా మైనార్టీలకు అన్యాయం

కవిటి, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతో ఒడియా మైనార్టీలకు అన్యాయం జరుగుతోందని ఉత్తరాంధ్ర ఒడియా మైనార్టీ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ పాడి అన్నారు. రాజపురం గ్రామంలో గురువారం ఆయనను ఒడియా మైనార్టీ విద్యార్థులు కలసి వినతిపత్రాన్ని అందించారు. ఎస్సీ గ్రూపు-1లోనున్న 12 ఒడియా మైనార్టీల ఉపకులాలకు ఒక్కశాతం రిజర్వేషన్ కేటాయించటం అన్యాయమన్నారు. డీఎస్సీ, స్థానిక ఉద్యోగ నియామకాలలో జిల్లా ను యూనిట్‌గా పరిగణనలోకి తీసుకోవాలని వారు కోరారు. వినతిపత్రాన్ని ఇచ్చిన వారిలో ఎన్.రవికుమార్, మురళీనాయక్, లావణ్య, శ్యామ్ తదితరులు ఉన్నారు.

ఎండల మల్లికార్జునస్వామి కల్యాణం

ఆమదాలవలస, మే 8 (ఆంధ్రజ్యోతి): గాజులకొల్లివలస పంచాయతీ పరిధిలోని బైరిశాస్త్రులపేటలో వెలిసిన ఎండల మల్లికార్జునస్వామి కల్యాణ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. లంక ఆదినారాయణ, శారద, మొండేటి గోవిందరాజు, తారకేశ్వరి దంపతులతో పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. .

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

గార, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి ఆధారాలు లేకుండా 56 మద్యం సీసాలు కలిగిన కేసులో వారాది సూర్యనారాయణ అనే వ్యక్తిని అరెస్ట్ చేశామని ఏఎస్ఐ మురళి తెలిపారు. నిందితుడిని గురువారం కోర్టులో హాజరుపరిచామని చెప్పారు.

సైనికులకు మద్దతుగా ర్యాలీ

కంచిలి, మే 8 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై దాడి చేసి, భారతదేశ ఆత్మగౌరవాన్ని నిలిపిన మన దేశ సైనికులకు మద్దతుగా గురువారం కంచిలిలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, జెడ్పీటీసీ సభ్యురాలు లోలాక్షి, ఎంపీపీలు దేవదాస్ రెడ్డి, ఎస్.దాసు, పుష్ప, నర్తు నరేంద్ర యాదవ్, ఇప్పిలి కృష్ణారావు, తడక జోగారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వాలతో కార్యకర్తలకు భరోసా



సభ్యత్వ నమోదు కార్డులను అందిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, మే 8 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేని సభ్యత్వ భరోసా తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలకు ఉందని ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని 9, 10, 11 వార్డుల్లో ఇటీవల సభ్యత్వం తీసుకున్న టీడీపీ కార్యకర్తలకు గురువారం ఆయన గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే రవికుమార్ ఇంటింటికీ వెళ్లి కార్యకర్తల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కార్యకర్తలకు అన్ని విధాలుగా ఆదుకోవాలనే ఆలోచనతో బీమా ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యకర్తలు ప్రమాదాలకు గురైనా, మరణించినా.. బీమా సౌకర్యం వర్తిస్తుందని వెల్లడించారు. ఈ కార్య క్రమంలో వార్డు ఇన్‌చార్జి ఎన్ని శ్రీదేవి, టీడీపీ నాయకులు తంగి గురయ్య, గొల్లపల్లి సింహాద్రి, నాగల మురళీధర్ యాదవ్, మహిళా కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే కీర్తి ప్రతిష్ఠలు

సరుబుజ్జిలి, మే 8 (ఆంధ్రజ్యోతి): యువత విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తే కీర్తి ప్రతిష్ఠలు సంపాదించుకోవచ్చునని ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. పురుషోత్తపురం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే కిల్లి అప్పలనాయుడు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ క్రీడలతో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, టీడీపీ నాయకులు అంబళ్ల రాంబాబు, తాడేల రాజారావు, కిల్లి సిద్ధార్థ, కిల్లి లక్ష్మణరావు, శేషు, లక్ష్మి, గోవింద, జగన్ పాల్గొన్నారు.

వెంకన్న వజ్రకవచ దర్శనం



స్వామికి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీఎన్ కాలనీలో ఉన్న నారాయణ తిరుమలలో వేంకటేశ్వర స్వామి గురువారం వజ్ర కవచంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామి వారిని పూలతో అలంకరించారు. స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. మొండేటివారి వీధిలో ఉన్న షిరిడి సాయి ఆలయంలో ఉన్న వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. శుక్రవారం వేంకటేశ్వర స్వామి విశ్వరూప దర్శనం, మహాలక్ష్మి కుంకుమ పూజలు, నిర్వహించనున్నట్లు నారాయణ తిరుమల నిర్వాహకులు తెలిపారు.

మెట్టవలసలో గ్రామదేవత ఉత్సవాలు ప్రారంభం



నీలమ్మతల్లికి ముర్రాటలు చెల్లించేందుకు వెళుతున్న భక్తులు

జి.సిగడాం, మే 8 (ఆంధ్రజ్యోతి): మెట్టవలస గ్రామదేవత అసిరితల్లి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం నీలమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో మహిళలు ముర్రాటలు చెల్లించుకున్నారు. ఆదివారం దేశాలమ్మ తల్లికి, మంగళవారం అసిరితల్లికి చెల్లించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

దేశ ప్రజలు గర్వించేలా 'ఆపరేషన్ సిందూర్': ఎంపీ

జి.సిగడాం, మే 8 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై మన సైనికులు 'ఆపరేషన్ సిందూర్'తో చేసిన దాడులు దేశ ప్రజలు గర్వించేలా ఉన్నాయని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. గురువారం డీఆర్‌వలసలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. ఇండియన్ ఆర్మీలో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల సెలవులకు గ్రామానికి వచ్చిన బాలి దుర్గారావును ఆయన సత్కరించారు. దేశ రక్షణకు సైనికులు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల సమస్యల పరిష్కార దిశగా తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం శివాలయం ఆవరణలో వనజీవి రామయ్య స్ఫూర్తితో 26వ రోజు మొక్కను నాటారు. ఆయనతో పాటు నాయకులు కుమరాపు రవికుమార్, అప్పన్న, జ్ఞానేశ్వరరావు, గోపాలకృష్ణంరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీకూర్మనాథుని కల్యాణం



స్వామి వారి తిరువీధిలో పాల్గొన్న భక్తులు

గార, మే 8 (ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మంలో శ్రీలక్ష్మీసమేత శ్రీకూర్మనాథుని దివ్య కల్యాణ మహోత్సవం గురువారం రాత్రి కన్నులపండువగా నిర్వహించారు. ఏటా వైశాఖ శుద్ధ ఏకాదశి రోజున ఇక్కడ స్వామి వారికి కల్యాణం నిర్వహిస్తారు. గురువారం రాత్రి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. ముందుగా స్వామి వారి ఉత్సవమూర్తులకు తిరువీధి మహోత్సవం నిర్వహించారు. గజవాహనంపై గోవిందరాజ స్వామి, హంస వాహనంపై శ్రీదేవి, భూదేవి, సీతమ్మను, చంద్రప్రభ వాహనంపై శ్రీరామ, లక్ష్మణులు, పల్లకీపై శ్రీచక్ర నారాయణస్వామి వారలను వేంచేపు చేశారు. మేళతాళాలతో గ్రామ మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించిన అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వేదికపై స్వామివారికి కల్యాణం నిర్వహించారు. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షా సూత్రధారణ ఘట్టాలను అర్చకులు చేయించారు. స్వామి వారి కల్యాణ తలంబ్రాలను భక్తులకు పంచిపెట్టారు. అనంతరం నీరాజన మంత్రపుష్పం, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు సీతారామ నరసింహాచార్యులు, ఈవో కె.నరసింహ నాయుడు, స్థానిక పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పురుషోత్తపురంలో విశ్వశాంతి యజ్ఞం



జలయాత్రలో పాల్గొన్న మహిళలు

ఇచ్ఛాపురం, మే 8(ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురంలో విశ్వశాంతి మహా యజ్ఞం ఘనంగా ప్రారంభమైంది. గురువారం జలయాత్ర నిర్వహించారు. పురుషోత్తపురం గ్రామం నుంచి కాలినడకన ఇచ్ఛాపురం మీదుగా బాహుదా నదికి మహిళలు చేరుకున్నారు. బిందెలతో బాహుదా జలాలను పట్టుకొని పురుషోత్తపురం వరకు బాజాబజంత్రీలతో జలయాత్ర నిర్వహించారు. వందలాది మంది మహిళలు ఈ యాత్రలో పాల్గొన్నారు.

ఆదిత్యుని దర్శించుకున్న సినీ గాయకుడు శ్రీకృష్ణ



గాయనీ గాయకులు శ్రీకృష్ణ, యామినిలకు జ్ఞాపికలు అందిస్తున్న దృశ్యం

అరసవల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షదైవం, ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని గురువారం సినీ గాయనీ గాయకులు శ్రీకృష్ణ, యామిని దర్శించుకున్నారు. వారికి అర్చకులు స్వాగతం పలికి వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అనంతరం ఇప్పిలి మాధవశర్మ వారికి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

ధ్రువపత్రాల పరిశీలనకు 134 మంది హాజరు



సీహెచ్‌సీలో క్యూలో ఉన్న పింఛనుదారులు

ఇచ్ఛాపురం, మే 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వాసుపత్రిలో నిర్వహించిన సదరం ధ్రువపత్రాల పరిశీలనకు 134 మంది హాజరయ్యారని, 9 మంది గైర్హాజరయ్యారని ఎంపీడీఓ రామారావు తెలిపారు. గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ధ్రువపత్రాలను డాక్టర్ ఎస్ .వెంకట రాజేష్ పరిశీలించారు. మొత్తం 143 మంది పింఛనుదారులకు గాను 134మంది హాజరయ్యా రని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరెంటెండెంట్ డాక్టర్ పాతిర్ల దేవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం



నిరసన తెలుపుతున్న కార్మికులు

ఇచ్ఛాపురం, మే 8 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం చేస్తామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు రమేష్ పట్నాయక్ అన్నారు. డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మూడో రోజు గురువారం మస్టర్ కార్యాలయం గేటు వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. అధికారులు మస్టర్ కార్యాలయానికి వెళ్లకుండా అరగంట సేపు గేట్లు వేసి నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించకపోతే నిరసన మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

శ్రీకాకుళం క్రైం, మే 8(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ సీహెచ్ వివేకానంద హెచ్చరించారు. గురువారం శ్రీకాకుళం టూటౌన్ పరిధిలోని వివిధ లాడ్జీలను తనిఖీ చేశారు. గదులను పరిశీలించి.. అందులో ఉన్న వ్యక్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గుర్తింపు కార్డులను పరిశీలించారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

అల్లినగరంలో చిత్రలేఖనం పోటీలు



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఎచ్చెర్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): అల్లినగరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా గురువారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. డ్రాయింగ్ ఉపాధ్యాయుడు లోకనాథం శంకర్ ప్రకాష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. లోకనాథం ఆర్ట్ గ్యాలరీ తరపున బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమం లో హెచ్ఎం పార్థసారథి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీచ్ ఫెస్టివల్ విజయంలో మీరే కీలకం

సోంపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): బారువ బీచ్ ఫెస్టివల్‌లో ఎటువంటి సమస్యలు రాకుండా విజయవంతంగా నిర్వహించడంలో విద్యుత్ సిబ్బంది కీలకంగా పనిచేశారని పలాస డీఈ గల్లా యోగేశ్వరరావు, డిప్యూటీ డీఈ ఎం.రవి ప్రశంసించారు. బుధవారం వీరిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ మేరకు సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేశారు.

రహదారులకు మహర్దశ

(ఐదో పేజీ తరువాయి)

ఇప్పిలి వయా పొగాకువానిపేట వరకు రూ.2కోట్లతో 5.20 కిలోమీటర్లు, జడ్పీ రోడ్డు నుంచి వయా బలివాడ, చిన్నవాడాడ వరకు రూ.75లక్షలతో 1.91 కిలోమీటర్లు బీటీ రోడ్డు నిర్మిస్తారు.

- టెక్కలి నియోజకవర్గ పరిధిలో కోటబొమ్మాళి మండలంలో రూ.169.69లక్షలతో కురుడు-చంత టు చిన్నసాన 3కిలోమీటర్లు, జాతీయరహదారి నుంచి కన్నేవలస-నారాయణపురం రూ.57.78లక్షలతో 1.05 కిలోమీటర్లు రహదారి నిర్మిస్తారు. సంతబొమ్మాళి మండలంలో రూ.141.97లక్షలతో బోరుభద్ర నుంచి కొల్లిపాడు వరకు 2.45కిలోమీటర్లు, రూ.54.84లక్షలతో జాతీయరహదారి కోటబొమ్మాళి నుంచి కాపుగోదాయవలస(సంతబొమ్మాళి) ఒక కిలోమీటరు రహదారి, రూ.87.53లక్షలతో డీపీఎం రోడ్డు టు ఉద్దండపాలెం వరకు 1.35కిలోమీటర్లు రోడ్డు నిర్మిస్తారు. అలాగే రూ.101.87లక్షలతో డీపీఎస్ రోడ్డు నుంచి గంగరాం వరకు 1.70కిలోమీటర్లు మేర బీటీ రోడ్లు నిర్మాణ పనులు చేపట్టనున్నారు.